# 13. వసంతోత్సవం

ఫిలిం షూటింగు ఎలా జరుగుతుందో చూడాలని గుంటూరునుంచి వచ్చిన మిత్రుడొకడు పదేపదే అడిగేసరికి, ఆ గొడవ ఏమిటో అత నికి చూపించడానికి తీసుకువెళ్లాను. ఆ స్టూడియో చాలా పెద్ద స్టూడి యోయే. అక్కడ తీసిన ఫిలిములలో కొన్ని, పెట్టుబడికి పదిరెట్లు లాభం తెచ్చినవీ వున్నాయి. కొన్ని పెట్టుబడివారులలో కొందర్ని కొంప ముంచి వేసినవీ వున్నాయి.

ఆ స్టూడియోలో, మేము వెళ్ళిననాడు తెలుగు ఫిలిమే ఒకటి షూటింగు జరుగుతోంది. జరగడంలేదు, జరగబోతోంది. మేము అక్క డికి వెళ్ళినప్పటి ఏర్పాట్లనుబట్టి, తెలుగు ఫిలిం (ఫలానా) షూటింగు ఆనాడు జరగవలసివుంది అనీ, దానికి సంబంధించిన ఏర్పాట్లు అన్నీ అవుతున్నాయనీ మాత్రమే అనుకోవాలి న్యాయానికి, కాని ఆ ఫిలిం తీస్తున్న కంపెనీ వారిలో కొందరూ, నటులలో కొందరూ, ముఖ్యంగా డైరెక్టరూ నాకు పూర్వమే పరిచితులు అయివుండడంవల్ల అక్కడి వివరాలు కొద్దిగా తెలుసుకున్నాను.

వారు తీసే ఫిలిం ఏదో పౌరాణిక గాథ. ఆనాడు షూట్‌చేసే సీను, ఏదో వసంతోత్సవము; ఆడపిల్లలు (అంటే రాజకుమార్తె, ఆమె చెలులూ) వసంతోత్సవాలు చేసుకోవడం అంతా తియ్యాలన్న మాట.

అప్పుడు ఉదయం పదకొండు గంటలయింది.

"ఏదండీ హీరోయినూ?" అని డైరెక్టరు కేక వేశాడు, ప్రొడ క్షను మేనేజర్ను చూసి.

"ఏదీ, ఇంకా రాలేదు" అని ఆయన తల గోకుకుంటూ సమా ధానం చెప్పాడు.

"ఇంకా ఆమె వచ్చేదెప్పుడు? మేకప్ చేసుకొనే దెప్పుడు? సెట్టు మీదికి వచ్చేదెప్పుడు? ఆమెకు కారు పంపించలేదా ఏమిటి ఇంకాను?" అని డైరెక్టరు వరుస వరుసన ప్రశ్నలు గుప్పివేశాడు.

"కారు పంపించక పోవడం ఏమిటండి! ఎనిమిది గంటలకు షూటింగు ప్రారంభమౌతుంది, మేకప్పు పూర్తిచేసుకొని సిద్ధంగా ఉండాలని చెప్పి తెల్లవారగానే ఆరయ్యేటప్పటికి కారు పంపించాను. ఇంతవరకు జాడలేదు. ఇప్పుడు పదకొండు గంటలయింది. ఎనిమిది గంటలకు షూటింగు మొదలు పెడతామని స్టూడియో వాళ్ళకు కాల్ షీటులో చెప్పాము. మూడుగంటలు వృథాగా గడిచిపోయాయి. ఒక్క రోజున, సరిగా టైముకు వచ్చిందండీ ఆమె?" అంటూ ప్రొడక్షన్ మేనేజరు, ఖాళీగా ఉన్న కుర్చీలో చతికిలపడ్డాడు.

"బాగాలేదండి యీ పద్ధతి!" అని డైరెక్టరు నిస్సహాయంగా నిట్టూర్పు విడిచాడు.

ఇంతలో కారు చప్పుడు అయింది. జోరుగా వచ్చి కారు ఆగింది. కారులోనుంచి హీరోయిన్ దిగింది. ఎవరితోటీ ఏమీ మాట్లాడకుండా చకచకా మేకప్ గదికి వెళ్ళింది. "మేకప్ త్వరగా పూర్తిచేసుకొని రమ్మని చెప్పండి" అని డైరెక్టరు కోరాడు. ప్రొడక్షన్ మేనేజరు అదే విధంగా కబురు పంపించాడు. ఆ కబురు చెప్పడానికి వెళ్ళినవాడు, ఒక నల్ల చీరె తీసుకువచ్చి, "ఈ చీరె బొత్తిగా నలిగిపోయిందట. దీన్ని ఇస్త్రీపెట్టెతో మడతలు దిద్దించి పట్టుకురమ్మన్నారండి" అని ఆ చీరెను చూపించాడు.

ఎవరూ ఏమీ మాట్లాడలేదు. ప్రొడక్షను మేనేజరు జేబులో నుంచి పర్సుతీసి, పావలా యిచ్చి, "కారులో వెళ్ళి త్వరగా ఇస్త్రీ చేయించుకురా" అని ఆ చీరె తెచ్చిన వాడికే చెప్పాడు. అతడు కారులో వెళ్లాడు

డైరక్టరూ, ప్రొడక్షన్ మేనేజరూ ఏదో కబుర్లు చెప్పుకుంటున్నారు. మధ్య రెండు మూడుమార్లు హీరోయిన్ దగ్గరనుంచి కబురు వచ్చింది- చీరె ఇస్త్రీచేసి తెప్పించారా లేదా అని.

"ఇంతసేపూ ఆమెచేసిన ఆలస్యానికి మనం ఏమీ అనకూడదు.

పది నిమిషాలు కాలేదు, మూడు కబుర్లు పంపించింది, చూడండి తమాషా'' అని ప్రొడక్షను మేనేజరు విసుక్కున్నాడు.

“అయినా ఇవ్వాళటి షూటింగుకి నిన్ననే ఏర్పాట్లు చేసుకొని వుండాలండీ! చీరెలు యిస్త్రీ చేయించడమూ, రవికెలు మడత పెట్టించడమూ, ఇప్పుడు పెట్టుకొని కూచుంటే, స్టూడియో అద్దెకు మాట్లాడిన వాళ్లము, ప్రతి నిమిషానికి డబ్బు వృథా అయిపోతుందే, కాలం వ్యర్థపుచ్చకూడదే అని మీరు ఆలోచించరు గదా!'' అని డైరక్టరు మొహం మీదపడ్డ క్రాపింగు వెనక్కు తీసుకున్నాడు.

అటూ ఇటూ పచారుచేస్తూ, అక్కడే తిరుగుతూ ఉన్న డైరక్టరుగారి తమ్ముడు “నా కొక వింటో కావాలి'' అని డైరెక్టరువైపు చూసి అన్నాడు. ఆలోచిస్తూన్న డైరక్టరు అదిరిపడి ప్రొడక్షన్ మేనేజరువైపు చూశాడు. ప్రొడక్షను మేనేజరు వింటో తెప్పించాడు. అతడు ఆ వింటో బాటిలును, తనతోపాటు కబుర్లు చెప్పుతూ అటూ యిటూ తిరుగుతూ ఉన్న ఎడిటర్‌కు యిచ్చి-“ఇంకోటి కావాలి'' అన్నాడు. ప్రొడక్షను మేనేజరు కళ్లనిప్పులు గ్రక్కుతూవున్నా, వాళ్లంతా మంటబుట్టినా మరొక వింటో తెప్పించి ఇచ్చాడు. ఆ రెండు వింటోలూ తను తాగినంత సంతృప్తి డైరక్టరు మొహంలో తాండవించింది. ప్రొడక్షన్ మేనేజరు ఏవో కూనిరాగాలు తీస్తూ కూచున్నాడు. డైరెక్టరు తన యెదుట పచారుచేస్తూ ఎడిటర్‌తో కబుర్లు చెపుతున్న తమ్ముడి వంక చూస్తూ, అతడు తనవైపు చూసినప్పుడు 'నీ అన్న ఫిలిం డైరెక్టర్ అనుకో' అన్నట్టు గర్వంగా చిరునవ్వుతూ వున్నాడు.

పదకొండుగంటల ముప్పావు అయింది. ప్రొడక్షను మేనేజరు నిట్టూర్పులు విడవడం ఎక్కువ అయింది. డైరక్టరు నిద్రమత్తు వచ్చినట్టుగా కళ్లు సగం మూసుకున్నాడు.

ముందుగా చప్పుడు, తరువాత కారు, వచ్చి ఆగాయి. షూటింగు ఇకనైనా త్వరగా ఆరంభిస్తారన్న ఆశతో షూటింగు చూడవచ్చినవాళ్ల ముఖాలు వికసించాయి. డైరక్టరు, ప్రొడక్షన్ మేనేజర్లు ఇద్దరూ సగం బెంగతీరినట్లు కనబడ్డారు. చీరె ఇస్త్రీ చేయించడానికి తీసుకొని వెళ్ళిన

వాడు, కారులో నుంచి దిగి ఆ చీరెను ప్రొడక్షన్ మేనేజరుకు చూపిం చాడు.

"నా కెందుకోయి. పట్టికెళ్ళి ఆమెకియ్యి. త్వరగా సింగారించు కొని దయచెయ్యమను. గంటకు నలభై రూపాయలు స్టూడియో అద్దె వృథా అవుతున్నదని చెప్పు" అని గదిమాడు ప్రొడక్షన్ మేనేజరు. అక్కడ ఉన్నవారంతా పకా పకా నవ్వారు.

చీరె తీసుకొని వెళ్లినవాడు, ఒక కిరీటం తీసుకొని వచ్చాడు. డైరక్టరు తెల్లపోయాడు. ప్రొడక్షను మేనేజరు వొళ్ళు ఒక్కసారి భగ్గు మన్నట్లు ఉలికి పడ్డాడు.

"ఈ కిరీటం నిన్న ఎవరో ఎక్స్ట్రాకు యిచ్చారట. ఆమె దీన్ని ధ్వంసం చేసిందట. దీన్ని సరి చేయించుకుని రమ్మన్నారండి" అని కిరీటం తెచ్చినవాడు, హీరోయిన్ సందేశాన్ని వినిపించాడు.

"దీని కేమయినా అర్థం ఉందా?" అని ప్రొడక్షన్ మేనేజరు ఉరిమాడు.

"నిజమేనండీ. హీరోయిన్ కిరీటాన్ని ఎవరికో ఇవ్వడమేమి టండీ' ఒక సీనులో ఒక రకపు కిరీటం, యింకొక దానిలో మరోరకపు కిరీటం, ఒక దాంట్లో వంకలుపోయిన కిరీటం, మరొక దానిలో విరిగి పోయిన కిరీటంతోను ఫిలింతీస్తే ఏడ్చినట్లు ఉంటుంది. ఆ కిరీటం త్వరగా వంకలు తీర్పించండి" అని డైరెక్టరు హుందాగా అన్నాడు.

"నాకెంత గ్రహచారం వచ్చిందయ్యా! ఎరక్క ఫిలింకంపెనీలో చేరాను. ఈ కిరీటాలు, చీరెలు, రవికెలు సర్దిపెట్టి కాపలా కాయవలసిన వాళ్ళు ఎవరండీ!" అన్నాడు ప్రొడక్షన్ మేనేజరు.

"ఆ సంగతి నాకూ తెలియదు. ఫిలిం డైరక్టు చెయ్యడం తప్ప రెండోది నాకు అవసరం లేదు" అన్నాడు డైరక్టరు.

"ఇప్పుడు యీ కిరీటాన్ని ఏం చేయమంటారు?" అని ప్రశ్నిం చాడు ప్రొడక్షన్ మేనేజరు.

"చేసేదేముంది? టౌనుకు పంపించి ఏదో ఒక కంపెనీలో బాగు చేయించి తెప్పించండి" అన్నాడు డైరక్టర్.

ప్రొడక్షన్ మేనేజరు కిక్కురు మనకుండా, డబ్బుతీసి ఆ కిరీ

టాన్ని తెచ్చినవాడికి యిచ్చి బాగుచేయించి తీసుకురమ్మని పంపించాడు.

పన్నెండు గంటల పావు అయింది.

"ఇప్పుడిది బాగుచేయించి తీసుకొని వచ్చేటప్పటికి అరగంట యినా కాదా?" అన్నాడు డైరక్టరు.

"అవుతుంది. టౌనుకు వూరికే వెళ్ళి రావడానికే గంట అవుతుంది, ఈలోపల మనం భోజనంచేసి రావచ్చును" అన్నాడు డైరక్టర్ తమ్ముడు.

"రెండోకారు ఇలా పిలవరా" అని డైరక్టరు అక్కడవున్న కుర్రాడితో చెప్పాడు. రెండో కారు వచ్చింది. డైరక్టరూ, తమ్ముడూ, ఎడిటరూ ఆ కారులో యెక్కి భోజనానికి వెళ్లారు.

ప్రొడక్షను మేనేజరు, అసిస్టెంటు డైరక్టరుతో కబుర్లు చెపుతూ కూచున్నాడు. పన్నెండుమ్ముప్పావు అయింది. హీరోయిను దగ్గర నుంచి కబురు వచ్చింది- "కిరీటం వచ్చిందా? ఇంకా ఆలస్యం ఉన్నట్లయితే నేను ఈలోపల యింటికి వెళ్ళి భోజనంచేసి రావచ్చునా?" అని.

ప్రొడక్షను మేనేజరు తెల్లపోయి, "మరి పదకొండు గంటలదాకా ఇంటిదగ్గర ఏం చేసిందిరా? భోజనంచేసి రాలేకపోయిందీ! ఇప్పుడెలా వెడుతుందీ? కారేమీ లేదని చెప్పు" అన్నాడు, ఆ కబురు తెచ్చిన కుర్రాడితో. వాడువెళ్ళి మళ్ళీవచ్చి "భోజనానికి వెళ్ళివచ్చి, మేకప్ వేసుకుంటారట. కారు లేకపోతే టాక్సీ తెప్పించమన్నారండీ" అని చెప్పాడు.

ప్రొడక్షను మేనేజరు మాట్లాడలేదు.

"టాక్సీ తెప్పించండి. పనిలోపని అయిపోతుంది. ఒంటిగంటకు ఎలాగా అందరూ భోజనాలకు వెడతారుకదా! ఈలోపల ఆమె కూడా వెళ్ళివస్తుంది" అని అసిస్టెంటు డైరెక్టరు అన్నాడు.

"నువ్వు ఎప్పుడూ ఆమెపక్షాన మాట్లాడుతావేమయ్యా" అని ప్రొడక్షను మేనేజరు, టాక్సీ తీసుకురమ్మని కుర్రాడికి చెప్పాడు.

టాక్సీ వచ్చింది. హీరోయిన్, తన భర్తతో సహా ఇంటికి భోజనానికి వెళ్ళింది.

ఒంటి గంట అయింది. కెమెరామెన్, సౌండు రికార్డిస్టులు భోజనానికి వెడుతున్నామని చెప్పి వెళ్లారు. చెలికత్తెల వేషాలు వేసిన

వాళ్ళందరికీ భోజనాలు వడ్డించమని వంటవాళ్ళతో చెప్పి, ప్రొడక్షన్ మేనేజరుకూడా, అసిస్టెంటు డైరక్టరుతోసహా భోజనానికి వెళ్ళాడు. వీరంతా మళ్ళీ వచ్చేటప్పటికి రెండుగంటలు అవుతుందని తెలిపి, స్టూడియో ప్రక్కనివున్న హోటలులో కాఫీ తీసుకోడానికి మేము వెళ్ళాము.

మా కాఫీ పూర్తిఅయి, మేము కాస్సేపు అటూ ఇటూ తిరిగి స్టూడియోకి చేరాము. డైరెక్టరూ, తమ్ముడూ, ఎడిటరూ, ప్రొడక్షన్ మేనేజరు అంతా చేరారు. హీరోయిన్ మాత్రం ఇంకా రాలేదు. కిరీటం బాగు చేయించి తీసుకురావడానికి వెళ్ళినవాడు దానిని బాగుచేయించి తీసుకు వచ్చాడట. అందరూ హీరోయిన్ కోసం ఎదురుచూస్తున్నారు. "ఇవ్వాళ అసలు షూటింగు జరుగుతుందా, జరగదా? మమ్మల్ని ఎందుకు ఊరికే కూచోపెట్టడం?" అని కెమెరామెన్, సౌండ్ రికార్డిస్టులు రెండుసార్లు కబుర్లు పంపారు.

"జరుగుతుందండీ, ఆమె రాగానే, మేకప్ చేసుకుని వచ్చేస్తుంది. అయినంతవరకే చేద్దాము" అని జవాబు పంపిస్తూ, వారికి రెండు వింటోలూ, ఒక గోల్డుఫ్లేక్ సిగరెట్ల పేకెట్టూ పంపించాడు ప్రొడక్షన్ మేనేజరు.

రెండున్నర గంటలకు హీరోయిన్ వచ్చింది. త్వరగా మేకప్ పూర్తిచేసుకొని రమ్మని ప్రొడక్షను మేనేజరు ఆమెకు సన్నని గొంతుతో చెప్పాడు. ఆమె "ఓకే" అంటూ వెళ్ళింది.

"సగం ఫిలిం అయిందాకా అమిత అడకువతో ఉంది. ఇక తన ఆటలు ఏవైనా సాగుతాయి కదా అని ధీమా" అని డైరెక్టరు తమ్ముడు రిమార్కు చేశాడు.

"మర్యాదకోసం చూస్తున్నానుగాని లేకపోతే ఏడు సముద్రాల నీళ్ళు త్రాగించివుందును" అని ప్రొడక్షన్ మేనేజరు అసిస్టెంటు డైరక్టరువైపుచూసి అన్నాడు.

"కూలికి పనిచేవాసేవాళ్ళ దగ్గర మర్యాద యేమిటి?" అని డైరక్టరు తమ్ముడు ఎడిటర్ వైపు చూపి అన్నాడు.

"అందరూ కూలికి పనిచేసేవారే. అధికారం చెలాయించడానికి యెవర్ని తెస్తాము?" అని ఈసడింపుతో డైరక్టరువైపు చూస్తూ అని,

ప్రొడక్షను మేనేజరు అక్కడనుంచి లేచి వెళ్లాడు. డైరక్టరు స్క్రిప్టు సర్దుకుంటూ మాట్లాడలేదు. డైరక్టరు తమ్ముడు ప్రొడక్షన్ మేనేజరు వైపు ఉరిమిచూసి పూరుకున్నాడు.

హీరోయిన్ మేకప్ వేసుకుని వచ్చేటప్పటికి మూడున్నర అయింది. షూటింగుకు అందరూ సిద్ధమయ్యారు. స్టూడియోలోనేవున్న పూలచెట్లలో వసంతాలు చిమ్ముకోవడం జరగాలి. హీరోయిన్, చెలికత్తెలతో వసంతోత్సవానికి తయారయింది.

"వసంతం చిమ్ముకొనే గొట్టాలు ఏవీ?" అని డైరక్టరు కేక వేశాడు.

"గొట్టాలు పట్టుకురా" అని ప్రొడక్షన్ మేనేజరు పెద్ద కేక వేశాడు.

పది నిమిషాలు అంతా నిశ్శబ్దం. "గొట్టాలు ఏవిరా?" అని ప్రొడక్షన్ మేనేజరు మళ్ళీ పెద్దగా అరిచాడు.

"కనపడ లేదండి" అని కుర్రాడు జవాబు చెప్పాడు.

"గొట్టాలు తీసుకురాలేదటయ్యా?" అని ప్రొడక్షన్ మేనేజరు అసిస్టెంట్ డైరక్టరువైపు వురిమిచూశాడు.

"కారులో వున్నాయ్" అని అసిస్టెంటు డైరెక్టరు జవాబు చెప్పాడు.

"కారులో వున్నాయట, తేరా" అన్నాడు ప్రొడక్షన్ మేనేజరు.

"ఏ కారులోనండీ?" అన్నాడు కుర్రాడు.

"చెవర్లెట్‌లో" అన్నాడు అసిస్టెంట్ డైరక్టరు.

"చెవర్లెట్ ఇక్కడ లేదు సార్" అన్నాడు కుర్రాడు.

"ఎవరు తీసుకు వెళ్లారు?" అని ప్రొడక్షన్ మేనేజరు ఉరిమాడు.

"కళ్లజోడు పెట్టుకున్నాడండి, ఆయనెవరో. ఆయన తీసు వెళ్లాడు" అన్నాడు కుర్రాడు.

"ఎవరా కళ్ళజోడాయన? కారెందుకు తీసుకెళ్ళాడు?"అని గదమాయించాడు ప్రొడక్షన్ మేజరు.

"కళ్లజోడు పెట్టుకున్నవాడు కారు తీసుకు వెళ్లకపోతే ఎట్లా?" అని వెకిలిగా నవ్వుతూ డైరక్టర్ తమ్ముడు అన్నాడు.

"ఆయన మేనేజింగ్ డైరక్టరుగారి భార్యకు పినతల్లి కొడుకండీ!" అన్నాడు అసిస్టెంటు డైరక్టరు.

"అయినా, కారెందుకు తీసికెళ్ళాడు? ఎక్కడికి కెళ్లాడేం?" అన్నాడు ప్రొడక్షన్ మేనేజరు.

"రామకృష్ణా లంచ్‌హోంకు కాఫీకి వెళ్లారండి, కవిగారిని తీసుకొని" అన్నాడు కుర్రాడు.

"కాఫీకోసం కీల్పాకునుంచి జార్జిటౌనుకు వెళ్ళడమే?" అని డైరెక్టరు తమ్ముడు విసుగుతో అన్నాడు.

ప్రొడక్షను మేనేజరు అతనివైపు పురిమి చూశాడు. హీరోయిన్ వెళ్ళి చెట్లసందున కూచున్నది.

"ఆ కారు వచ్చినదాకా యిలా మాట్లాడక కూచోవలసిందేనా?" అని డైరక్టరు అన్నాడు.

"లక్షణంగా" అని జవాబిచ్చాడు డైరక్టరు తమ్ముడు.

"ప్రతిదానికీ ఇతడి జోక్యమేమిటి? రోజూ స్టూడియోకి ఇతడు రావడం ఎందుకు?" అని ప్రొడక్షన్ మేనేజరు, అసిస్టెంటు డైరెక్టరుతో మెల్లిగా అన్నాడు. అసిస్టెంటు డైరక్టరు నిలువునా తలకాయ వూపాడు.

"ఏమిటి చెయ్యడం? మబ్బుకూడా పట్టేటట్టున్నది, నాలుగుంపావు అయింది. అయిదు గంటలకు టెక్నీషియన్సు వెళ్ళిపోతారు. ఏమిటండీ ఈ అరెంజిమెంట్లు" అని డైరక్టరు, ప్రొడక్షన్ మేనేజర్ను చూసి అన్నాడు.

"నా లోపమేముందడి? చూస్తూనే వుంటిరిగా, యాక్టర్లను తెచ్చిన వారు మీరు, వాళ్లకు మీ మాట——" అని ప్రొడక్షన్ మేనేజరు ఏదో అనబోతూంటే, డైరక్టరు "ఏ స్టూడియోలోనయినా అంతేలెండి" అన్నాడు.

"అందరూ ఇలాగే చేసుకుంటారా? అందరు డైరక్టర్లూ-" అని సగంలో ఆపివేశాడు ప్రొడక్షన్ మేనేజరు. డైరక్టరు అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

నాలుగుమ్ముప్పావు అయింది. చెవర్లెట్ కారు వచ్చింది. కారులోనుంచి కళ్లజోడు ఆయనా, కవీ దిగారు. వాళ్లని ఎవరూ ఏమీ అనలేదు.

"కారులోనుంచి గొట్టాలు తియ్యరా" అని ప్రొడక్షన్ మేనేజరు కేక వేశాడు.

గొట్టాలు కారులోనుంచి తీసి, వాటిని నీళ్ల తోనింపి హీరోయి న్కూ చెలికత్తెలకూ యిచ్చి, కెమేరాను, అమర్చేటప్పటికి, అయిదు గంటలయిందని స్టూడియో గంట మ్రోగింది.

"నేను వెళ్లాలి, పనుంది" అని కెమెరామన్ వెళ్లిపోయాడు.

"ఒక్కగంటవుండి పొమ్మనండీ" అని ప్రొడక్షను మేనేజరు డైరెక్టరువైపు చూసి అన్నాడు.

"వాళ్ల టైము అయిపోతే వాళ్లు వుంటారా? మనం ఇచ్చినటైము కూడా ఎనిమిదినుంచి అయిదు గంటలదాకానే కదా!" అన్నాడు డైరెక్టరు.

బస్సుచార్జీలు దండుగ అయినాయనీ, ఒక రోజు వృథా అయిం దనీ విచారిస్తూ నేనూ, నా స్నేహితుడూ ఇంటిదారి పట్టినాము.

---

# 14. సత్యాగ్రహం

పదిమందీచేరి, నాలుగురోడ్లూ కలిసేచోట మధ్యగా కట్టిన చౌతరా మీద కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

"అడుగో నరసయ్య వస్తున్నాడు. ఏదో లేనిపోని గొడవ తెచ్చి పెట్టి పోట్లాటలోకి దింపుతాడు" అంటూ వెంకటరామయ్య లేచి వెళ్ళి పోయాడు.

"మొన్న సాయంత్రం- నీలాచలాన్ని చావగొట్టాడట గాదూ!" అన్నాడు వీరయ్య.

"చావగొట్టడమేమిటి, వాడింకా మంచం మీదనుంచి లేవలేదు. ఈ నరసయ్య వ్యవహారం రోజురోజుకి ముదిరిపోతోంది. వీణ్ణి ఎవళ్ళూ